
కథ

# రాఖీ




రావినూతల సువర్ణాకన్నన్

సాయంత్రం మూడు గంటలయింది.

వూరికొస్త దూరంగా వున్న ఓపాటి మేడ నిశ్శబ్దంగా వుంది. అప్పుడే స్కూలు బస్సులోంచి దూకినట్టు దిగి ఆ మేడలోకి పరుగుతీసింది ఆరేళ్ళ నీలిమ. స్కూల్ బేగ్, టిఫిన్‌బాక్సు సోఫాలో పడేసి –

"అమ్మా" అంటూ ఓ గావుకేక పెట్టింది.

మేడమీద జడ అల్లుకుంటున్న ఆమె తల్లి ఇరవై ఏళ్ళ పావని కంగారుగా పరిగెత్తుకొచ్చింది.

"అమ్మా ! నాకు అర్జంట్‌గా రెండువందలు కావాలి!" ఎలాంటి వుపోద్ఘాతమూ లేకుండానే అంది నీలిమ.

ఎందుకో ఆమె మొహం వెలిగిపోతోంది.

"రెండువందలా!" విస్మయంగా చూసింది పావని.

కారణం ఆ పిల్ల డబ్బు ఏనాడూ అడగ లేదు. ఏ ఎక్స్‌కర్షన్‌కైనా వెళ్తే ఆ విషయమే ఇంట్లో చెప్పేది.వాళ్లు డబ్బు ఇచ్చి పంపేవారు.

"ఇప్పుడు నీకు రెండొందలు దేనికే?" నవ్వుతూ వచ్చింది నీలిమ అమ్మమ్మ పంకజాక్షి.

ఆమెకి నలభై అయిదేళ్ళున్నా, ఎప్పుడూ చిన్న పిల్లలా మేకప్ చేసుకుని కాస్త ఎబ్బెట్టుగా కనిపిస్తుంది.

"స్కూల్‌వాళ్ళు ఏదైనా టూర్ తీసి కెళ్తున్నా రేమో!" అంటూ వచ్చారు, నీలిమ అక్కలుగా పిల్చే ముగ్గురమ్మాయిలు. వాళ్ళకీ ఇరవై ఏళ్ళ లోపే వుంటుంది వయసు. పావని అంత అందంగా ఉండక పోయినా అందంగానే వుంటారని చెప్పచ్చు.

"టూర్‌కాదు. ఏం కాదు నాకు వేరే పనుంది. రెండొందలు కావాలి! ఇస్తారా ఇవ్వరా?" దబాయించినట్టు అంది నీలిమ.

"రెండొందలు కాకపోతే అయిదొందలు తీసుకో; కానీ ఎందుకో మాకు చెప్పాలిగా?" అనునయంగా అంది పంకజాక్షి.

"చెప్పకపోతే ఇవ్వరా?" కోపంగా అంది నీలిమ.

"చెప్పకపోతే రూపాయికూడా ఇవ్వమే!" చిరాగ్గా అంది పావని.

నీలిమకి పిచ్చ కోపం వచ్చేసింది.

"ఏవిఁటి! రూపాయికూడా ఇవ్వరా? అక్కలు ఎంతడబ్బడిగినా నోరెత్తకుండా ఇస్తారు. మీఅందరి దగ్గరా బోల్డంత డబ్బుంటుంది. నాదగ్గర మాత్రం పదిరూపాయిలు కూడా వుండవు. అడక్క అడక్క రెండొందలు అడిగితే ఇన్ని ఆరాలు తీస్తారా?అసలు మీ డబ్బా వద్దు. మీరూ వద్దు. నేను అన్నం కూడా తినను. స్కూల్‌కెళ్ళను!" అంది కోపంగా.

పక్కున నవ్వింది పంకజాక్షి.

"నీకు డబ్బుకేం తక్కువ తల్లీ! ఒక్క పదేళ్ళాగు! డబ్బే కాదు. నీమీద కనకవర్షం కురుస్తుంది. నీ కాళ్ళదగ్గర నోట్లకట్టలు రాసులు గా కుమ్మరిస్తారు." అంది ఆమెని పొదివి పట్టుకుంటూ.

"ఆఁ! ఇవాళ రెండువందలు లేవుగానీ రేపు ఎప్పుడో కనకవర్షం కురిపిస్తారట! నాకేం అక్కర్లేదు!" నీలిమకి ఏడుపొచ్చేసింది.

పంకజాక్షి బుజ్జగించి, బతిమాలి విష యం రాబట్టి విస్తు పోయింది.

"అవునమ్మమ్మా! రేపు రాఖీపండగ కదా! మా స్కూల్‌పిల్లలంతా చాలా హడావిడి చేస్తు న్నారు. అన్నలకీ, తమ్ముళ్ళకీ రాఖీలు కడతారట! నేనూ కట్టాలి. అందుకే నేను డబ్బడిగింది!" మెరుస్తున్న కళ్ళతో అంది నీలిమ.

పావని మొహం వెలవెలపోయింది.

"ఆలోచన బానే వుంది కానీ నీకు అన్నలు కానీ, తమ్ముళ్ళు కానీ లేరుగా" అంది బల వంతంగా నవ్వుతూ.

"రాఖీ కట్టడానికి స్వంత అన్నదమ్ములే అక్కర్లేదట! మనం రాఖీ కడితే వాళ్ళే మన అన్నదమ్ములవుతారట! మా స్కూల్లో నేనంటే చాలామందికి ఇష్టం. వాళ్ళలో కొందరికి కడ తాను!" వుత్సాహంగా చెప్పింది నీలిమ.

"అయ్యో పిచ్చితల్లీ! రాఖీలు కట్టే వంశం కాదమ్మా మనది! మగాళ్ళని కొంగున ముడేసు కుని మన చుట్టూ తిప్పించుకునే వంశం! నువ్వు రాఖీ కట్టకూడదు!" అంది పంకజాక్షి ఆ పిల్లని పట్టుకుని బుజ్జగిస్తూ.

"ఎందుక్కట్టకూడదూ! నిరుడు అడిగినా ఇలాగే అన్నారు. అప్పుడు నేను చిన్నదాన్ని. ఇప్పుడు పెద్దదాన్నయిపోయాను. ఈసారి నేను రాఖీ పండగ జరుపుకు తీరాల్సిందే. కాదంటే పాలుకూడా తాగను!" బెదిరించింది నీలిమ.

అందరూ కలిసి ఆమెకి ఏవేవో చెప్ప బోయారు.అయితే ఆ పిల్ల వినలేదు. రాఖీ కట్టే తీరాలి. అంటూ మొండిపట్టు పట్టింది.

చివరికి పెద్దలే దిగివచ్చి

"సరే; అలాగే ఇస్తాం! రాఖీ పండగ చేసుకో!" అనేశారు.

నీలిమ మొహం వెలిగిపోయింది.

"మా అమ్మమ్మ చాలామంచిది!" అంటూ ఆమె చెంపలమీద ముద్దులు పెట్టి వుత్సాహంగా మేడమీదికి పరిగెత్తింది.

భారంగా నిట్టూర్చారంతా

నిజానికి పంకజాక్షికి, మిగతావారికి ఎలాంటి బంధుత్వం లేదు. ఆమె పేరు పడ్డ వేశ్య. ఒకప్పుడు హేమాహేమీలు ఆమె ఇంటి చుట్టూ తిరిగి నోట్లకట్టలు సమర్పించుకునేవారు.

అయితే ఆమె వ్యభిచారం చేస్తున్నా మంచి, మానవత్వం, దయ జాలిలాంటివి నర నరాల్లోనూ జీర్ణించుకుపోయాయి.

ఆ గుణాలే దిక్కులేని పావనిని ఆ ఇంటికి చేర్చాయి. పావని తల్లిదండ్రులు లేని అనాథ. అడవిలో ఎండు పుల్లలేరుకుని వాటిని అమ్మి పొట్టపోసుకునే నిర్భాగ్యురాలు అయితే చాలా అందంగా వుంటుంది. ఆమెకి పద్నాలు గేళ్ళ వయసులో,నిండు నెలలతో ప్రసవవేదన పడుతూ ఓ చెట్టుకింద పడున్న ఆమెని అటుగా వెళ్తున్న పంకజాక్షి చూసి, తన కారులోనే హాస్పిటల్‌కి తీసికెళ్ళింది.

పావనికి పండంటి పాప పుట్టింది.

పావని కాస్త తేరుకున్నాక రాయుడు అనే పెద్దమనిషి, పుల్లలేరుకుంటున్న తనమీద అత్యాచారం చేశాడనీ, ఆ పాప ఫలితమే ఈ బిడ్డ అనీ, మరికొన్ని వివరాలూ చెప్పింది.

రాయుడు ఆ వూళ్ళో పెద్దమనిషిగా చెలా మణి అవుతున్న లక్ష్మీపుత్రుడు. అతన్ని గురించి, అతని రాక్షసత్వం గురించీ పంకజాక్షికే కాదు. చాలామందికి తెలుసు.

అతనితో వైరం పెట్టుకోవడం కొండతో ఢీ కొట్టుకోవడమే అని తెలిసిన పంకజాక్షి, తన స్థావరమే మార్చి, మరో వూరు చేరి, వూరికి చివరిగా ఓ ఇల్లు ఏర్పరుచుకుంది.

ఎలా మారిందో, ఎందుకు మారిందో గానీ పావని కూడా పంకజాక్షి మార్గంలోనే అడుగు పెట్టింది. ఆమే కాక దిక్కులేని మగవారి మాటలు నమ్మి మోసపోయిన వారు కూడా కొందరు పంకజాక్షి నీడలోకి చేరారు.

అందరూ ఆమెని అమ్మా అనే పిలుస్తారు. నీలిమ అంటే అందరికీ ప్రాణం. పంకజాక్షి పైకి అలామాట్లాడినా, నీలిమని తను వృత్తిలోనికి రానివ్వకూడదనీ,ఆమె చక్కగా చదువుకుని,మంచి వుద్యోగం సంపాదించుకుని, తమకి భిన్నంగా పెళ్ళి చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటోంది.

అయితే వాళ్ళనిగురించి తెలిసిన వాళ్ళె వరూ వాళ్ళనో చీడపురుగుల్ని చూసినట్టు చూసేవారు.

డబ్బు దండిగా వుంది కాబట్టి స్కూల్లో నీలిమని బానే చూసుకున్నా, తరచూ వ్యంగ్యంగా మాట్లాడి నవ్వుకునేవారు అయితే ఆ వ్యంగ్యాన్ని అర్థం చేసుకోలేని నీలిమ వాళ్ళతో కలిసి

నవ్వేసేది. అందరూ తననిప్రేమగా చూసుకుంటు న్నారని మురిసిపోయేది.

అందుకే తనూ రాఖీ పండుగ జరుపు కోవాలని సరదా పడింది. అతి కష్టంమీద పెద్దల్ని ఒప్పించింది.

ఆ రాత్రి నీలిమకి నిద్ర పట్టలేదు.

అందమైన రాఖీలు కొన్నట్టు, తనకిష్టమైన వాళ్ళకి కట్టినట్టు ఆ రాఖీలు చూసి అంతా మురిసి పోయినట్టూ వూహించుకుంది.

తెల్లవారుతూనే స్నానం చేసి చక్కని పట్టు పరికిణీ జాకెట్టు వేసుకుని, అమ్మమ్మ ఇచ్చిన డబ్బు తీసుకుని బయల్దేరింది.

"అమ్మా ! నీకు బాగా తెలిసిన వాళ్ళకే కట్టు! లేకపోతే వాళ్ళేమైనా అనుకోవచ్చు!" అన్న పంకజాక్షి మాటలు గాలిలో కలిసిపోయాయి.

ఇంటిక్కాస్త దగ్గరగా వున్న ఓ షాపు కెళ్ళింది. బైట అందమైన తోరణాల్లా రాఖీలు వేలాడుతున్నాయి.

"ఏం కావాలి?" అన్నట్టు చూశాడు షాపతను.

"అందమైన, ఖరీదైన రాఖీలు కావాలి!" దర్పంగా అడిగింది నీలిమ.

"రాఖీలా? నీకా?" బాంబ్ అడిగినంత విస్మయంగా అన్నాడతను

"అవును! ఇవాళ రాఖీ పండక్కదా! మా ఫ్రెండ్స్‌కి నేనూ రాఖీ కడతాను!" నవ్వుతూ అందామె.

అతనేదో గొణుక్కుంటూ ఆమె కోరుకున్న రాఖీలు కొన్ని ఇచ్చాడు. వాటిని తీసుకుని రిక్షా మీద స్కూలు చేరుకుంది నీలిమ.

స్కూలంతా పిల్లలతోనూ, పెద్దలతోనూ చాలా సందడిగా వుంది. ఆ రోజు కూడా స్కూలుకి అంతమంది వస్తారనీ, అంత సరదాగా వుంటారనీ వూహించని నీలిమ మరింత ఆనంద పడిపోయింది.

అటుగా వెళ్తున్న ఓకుర్రాణ్ని చూసి -

"మనూ!" అంది అరిచినట్టు.

మనూ అన్నతను తిరిగి చూసి-

"అరె ! నువ్వేంటిలా వచ్చావ్?" అన్నాడు ఆశ్చర్యంగా

"మీరంతా ఎందుకొచ్చారో, నేనూ అందుకే వచ్చాను. చూడు! ఈ రాఖీ బావుంది కదూ!ఇది నీకుకట్టాలని వచ్చాను!" వుత్సాహంగా అంది నీలిమ. రాఖీ చూపిస్తూ.

"నాకా? నాకు చాలామంది కట్టారు!" అంటూఎవరో తరుంతున్నట్టు పరిగెత్తాడతను.

బిత్తరపోయిందామె.

"ఓహో ! రాఖీ కడితే ఏదైనా ఇవ్వాలి కదా! వట్టి పిసినారివెధవ! అందుకే పారి పోయాడు!" అని సర్ది చెప్పుకుని మరో కుర్రాణ్ని అడిగింది.

"నీమొహం!నువ్వ రాఖీ కట్టడంఏమిటి? రాఖీలు అన్నలకే కడతారు!"అన్నాడతను వ్యంగ్యంగా.

"నువ్వు నాకు అన్నయ్యవే అనుకో!" అమాయకంగా అందామె.

"ఛ! నువ్వు నాకు చెల్లెలివేంటి!" అంటూ నవ్వేసి వెళ్ళిపోయాడతను కూడా.

ఆమె మరింత బిత్తరపోయింది.

వాళ్ళేకాదు. ఆమె చేత రాఖీ ఎవరూ కట్టించుకోలేదు. పంతంగా పెద్ద క్లాసు పిల్లల్ని కూడా బతిమాలి భంగపడింది.

ఆమెకి దుఃఖం వచ్చేసింది.

రాఖీ కట్టాలనే పంతం పెరిగింది. కానీ ఏం చెయ్యాలో, ఎవరిక్కట్టాలో అర్థం కాక ఏడుస్తూ నిల్చుండిపోయింది.

"ఏవిఁటీ నీలీ!ఎందుకేడుస్తున్నావ్?" అంటూ వచ్చాడు ఓ టీచర్.

ఆమెకి ప్రాణం లేచొచ్చినట్టయింది. విషయమంతా చెప్పి "టీచర్ ! నాకు రాఖీ కట్టాలని చాలారోజులుగా ఆశగా వుంది. కానీ ఎవరూ ముందుకు రావడంలేదు. దయచేసి మీరైనా కట్టించుకోరూ?" అంది దీనంగా.

అతను ఇబ్బందిగా చూసి -

"ఛ!నేను రాఖీ కట్టించుకోవడం ఏమిటి?" అన్నాడు కంపరంగా వాళ్ళని చూసి విషయం తెలుసుకున్న మరోటీచర్ - "ఇప్పుడు కాదు. పదేళ్ళ తర్వాత కనిపించు ! మాట్లాడదాం. కానీ రాఖీ కట్టించుకోవడానిక్కాదు!" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

"తొందరగా పద! ఇక్కడుంటే బల వంతంగా అయినా కడుతుంది! అని ఏదో అసభ్యంగా మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు టీచర్లు.

నీలిమకి చచ్చిపోవాలనిపించింది. అయినా ఆశ చావక టెన్త్ క్లాస్ పిల్లల్ని సైతం బతిమాలింది రాఖీ కట్టించుకోమని. వాళ్ళూ ఆమెని ఎగాదిగా చూసి-

"నువ్వు పంకజాక్షి మనవరాలివి కదూ! నువ్వు రాఖీ కడతావా!" అని ఫక్కున నవ్వు కుంటూ కదిలిపోయారు.

చిన్నారి నీలిమ మనసు దారుణంగా గాయపడింది. తనచేత రాఖీ ఎందుకు కట్టించు కోవడం లేదో ఎంత ఆలోచించినా ఆ పసి మనసుకి అర్థం కావడం లేదు.

నీరసంగా గేటు దాటి బైటికొచ్చింది. గేటు దగ్గర పల్లీలమ్ముకునే తాత పలకరించే సరికి, బాధగా తన విషయం చెప్పి

"తాతా ! ఎందుకో ఇంత చక్కని రాఖీలు తెచ్చినా ఎవరూ కట్టించుకోవడంలేదు. నువ్వ యినా కట్టించుకోవూ?" అంది వేడుకోలుగా.

"నువ్వు పంకజాక్షి మనవరాలివి కదూ?" అన్నాడతను ఏదో ఆలోచిస్తూ.

"అవును. ఆవిడ మా అమ్మమ్మే! చాలా మంచిది, మా అమ్మ పేరు పావని!" కళ్ళు తుడుచుకుంటూ అంది నీలిమ.

ఒద్దులే తల్లీ ! నన్నిలా బతకనీ ! రేపు నువ్వు పెద్దయ్యాక నేనొచ్చినా, రాకపోయినా, నా తమ్ముడు నీ దగ్గరికి రావచ్చు. అప్పుడు వరసలే మారిపోతాయి!" అంటూ ముసిముసిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడతను.

"వీళ్ళ తమ్ముడు నా దగ్గరికి రావడం ఏమిటి, వరసలు మారిపోవడం ఏమిటి?" అన్న ప్రశ్నలు ఆ పసి మనసుని చిందర వందర చేసేశాయి.

రిక్షా ఎక్కాలన్న మాటే మర్చిపోయి, పరధ్యానంగా ఇంటి మొహం పట్టింది నీలిమ. చేతిలోని అందమైన రాఖీలు ఇప్పుడు అతి భారంగా అనిపించసాగాయి.

అప్పుడే సడన్‌బ్రేక్‌తో ఆగిపోయిందో ఖరీదైన కారు.

తృళ్ళిపడి పక్కకి జరిగింది నీలిమ. ఆ కారుని, కార్లో వున్న నిరంజన్‌ని చూడగానే ఆమె మొహం వెలిగిపోయింది. అతను తన స్కూల్లోనే టెన్త్‌క్లాసు చదువుతున్న ప్రయాగ తండ్రి. ప్రయాగ చాలా మంచివాడు. తనంటే చాలా ఇష్టం.

అప్పుడప్పుడు ఆప్యాయంగా మాట్లాడి స్వీట్స్ అవీ కూడా ఇస్తూంటాడు.

ప్రయాగ తండ్రి కార్లోనే స్కూల్‌కి వచ్చి వెళ్తాడు. అందుకే ఆ కారుని, నిరంజన్ని తేలిగ్గా గుర్తు పట్టిందామె. కారుదిగిన నిరంజన్ –

"ఏవిఁటి చావాలనుకుంటే నా కారే దొరికిందా?" అన్నాడు మండి పడుతూ.

"సారీ అంకుల్! పరధ్యానంగా నడవడం నా పొరపాటే" నొచ్చుకుంటూ అంది నీలిమ.

"ఛ ! నడిరోడ్డుమీద నడవడం, సారీ చెప్పడం, కారుకింద పడి చస్తే డబ్బుకోసం వేధించడం.......ఈజనాలకి అలవాటయి పోయింది!.....సరేలే ! పో !" అన్నాడతను గొణుక్కుంటూ

నీలిమలో చిన్నఆశ తళుక్కుమంది.

"అలాగే వెళ్తానంకుల్! చిన్నసాయం చేస్తారా!" రెండుచేతులూ జోడించి దీనంగా అంది.

"ఏంటి డబ్బుకావాలా!"కస్సుమన్నాడతను.

"ఊఁహు! కాదు. నాచేత రాఖీ కట్టించు కోండి!" అంటూ తనకి జరిగిన అనుభవమంతా దీనంగా చెప్పింది నీలిమ.

అతని కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఎంత ధైర్యమే నీకు? నాకు రాఖీ కడతావా? ముందవతలకి పో !" అన్నాడు ఆవేశంతో వూగిపోతూ.

ఆమె బతిమాలింది. వేడుకుంది. ఓ బంగారురంగుతో మిలమిల మెరుస్తున్న అంద మైన రాఖీ తీసుకుని అతని చెయ్యి పట్టుకుంది.

అంతే! అతను విదిలించి కొట్టాడు.

ఆమె వెళ్ళి అంత దూరాన పడింది. ఆ పక్కనే వున్న ఓ పెద్దరాతి కోణం ఆమె తలకి గుచ్చుకుని నెత్తురు చిమ్మింది.

"అమ్మా!" అంటూ తలమీద చెయ్యి పెట్టుకుని కుప్పకూలి పోయింది నీలిమ.

అతను క్షణం బిత్తర పోయాడు.

క్షణాల్లో జనం పోగయ్యారు. అయితే అంతా వినోదం చూసినట్టు నిల్చుండి పోయారే గానీ, ఒక్కరూ ఆమెని హాస్పిటల్‌కి తీసికెళ్ళాలని ప్రయత్నించలేదు.

అవును మరి ! కార్లో వున్న పెద్దమనిషి సామాన్యుడా !

"ఛ ! వెధవ న్యూసెన్స్ !" అనుకుంటూ కార్లో కూర్చుని కారు స్టార్ట్ చెయ్యబోయాడు నిరంజన్

వెనక సీట్లో కూర్చున్న ప్రయాగ దూకి నట్టు కారు దిగి నీలిమకేసి పరిగెత్తాడు.

"ఏయ్ ! నువ్వెక్కడికి!" కంగారుగా అన్నాడు నిరంజన్. అతను మాట్లాడకుండా నీలిమదగ్గరికెళ్ళి నెత్తురుతో తడిసిన ఆమె తలని ఒళ్ళోకి చేర్చుకున్నాడు.

"నీలిమా!"అన్నాడామె చెవిలో మృధువుగా.

ఆమె కళ్ళుతెరిచి ప్రయాగని గుర్తించింది. ఆస్థితిలోనూ ఆమెకళ్ళు తళుక్కుమన్నాయి.

"ప్రయాగా!...ఇందులో నా తప్పేం లేదు ప్రయాగా.... ఆయాసంతో ఏదో చెప్ప బోయిన ఆమెనాపేశాడతను.

"నేనంతా చూశాను. సారీ! ఇప్పటికే ఆలస్యం చేశాను. పద ! హాస్పిటల్‌కెళ్దాం !" ఆమెని లేవదీస్తూ అన్నాడు.

"ఒద్దు ప్రయాగా!..నాకు బ్రతకాలనిలేదు. నాకు ఎవరికైనా రాఖీ కట్టాలని వుంది.ఆతర్వాత చచ్చిపోయినా పరవాలేదు.ప్రయాగా! నువ్వ యినా నాచేత రాఖీ కట్టించుకోవూ? ప్రయాగా! నువ్వు నాకే కానుకలు ఇవ్వద్దు. నాకు ఓ అన్నలాంటివాడు వున్నాడనీ, నేను రాఖీ కట్టాననీ తృప్తిగా చచ్చిపోతాను. ప్లీజ్ ప్రయాగా! రాఖీ కట్టించుకోవూ?" అతిప్రయాసగా అంది నీలిమ.

అతనికి దుఃఖం వచ్చేసింది.

"కట్టు నీలిమా! కట్టు! నేన్నీకు అన్నలాంటి వాణ్ణే కాదు ! స్వయానా నీ అన్ననే ! తొందరగా కట్టు!" అన్నాడు చెయ్యి చాస్తూ.

ఆమె కళ్ళలో వేయి పున్నంల వెలుగు చోటు చేసుకుంది. అతి ప్రయాసగా రాఖీ తీసింది. అయితే, మిలమిల మెరిసే ఆ రాఖీ, ఆమె నెత్తురులో తడిసి ఎర్రగా అయిపోయింది.

"ఇదంతా నెత్తురుతో తడిసిపోయింది ప్రయాగా!" దిగులుగా అంది నీలిమ.

"పరవాలేదు!ఇదీ నాకు ఒక గుణపాఠమే! తొందరగా కట్టు!" తొందరపెట్టాడతను.

ఆమెఆనందంగా అతనిచేతికి రాఖీకట్టింది.

"ప్రస్తుతానికి నీకింతకన్నా కానుకలేం ఇవ్వలేను నీలీ!" అంటూ ఆమె నుదిటిమీద సున్నితంగా ముద్దు పెట్టుకుని, ఆమెని బుజాన వేసుకుని నాలుగడుగులు వేశాడు ప్రయాగ.

అంతవరకూ ప్రతిమలా నిల్చుండి పోయిన నిరంజన్ –

"ఏయ్ ! ఏవిఁటి నువ్వు చేస్తున్న పని?" అన్నాడు ఆగ్రహంగా

"నువ్వు చేసిన పాపానికి నేను ప్రాయా శ్చిత్తం చేసుకుంటున్నాను మిస్టర్ నిరంజన్ నాయుడు ! పుల్లలేరుకుని బతికే ఓ పసిపిల్ల మీద కీచకుళ్ళా పడి అత్యాచారం చేసి, ఈ చిన్నారిని ఈ స్థితికి తెచ్చింది నువ్వే అని నాకు తెలుసు ! ఇవన్నీ నీకు తెలిసినా, నాకు తెలుసని పాపం ! నీకు తెలియదు. నీ పెద్దరికపు వేషాన్ని గురించి, నీ పరపతిని గురించి, నీకున్న సంపదల గురించీ భయపడే ఈ జనాలకీ నీ గురించి బాగా తెలుసు. అయినా నోరు విప్పరు. నువ్వెంత కామాంధుడివో.ఎంతమంది ఆడవాళ్ళ జీవితాల్లో చిచ్చురగిల్చావో, పద్నాలుగేళ్ళు నిండని ఆ పావనిగారిని ఎంత కిరాతకంగా అనుభవించావో నాకే కాదు. చాలా మందికి తెలుసు. అయితే ఇన్ని తెలిసినా నా వయసు నా నోరు కట్టేసింది. ఇవాళ జరిగిందాన్ని మాత్రం నేను సహించను!" ఆవేశం ఆవేదన నిండిన గొంతుతో అన్నాడు ప్రయాగ.

"అయితే ఇప్పుడేమంటావ్! దాన్ని తీసికెళ్ళి అందలం ఎక్కిస్తానంటావా?" వ్యంగ్యంగా అన్నాడు నిరంజన్.

"లేదు. కష్టపడతాను. కూలి చేసైనా నా చెల్లెల్ని పోషించుకుంటాను. నీలిమ నా చెల్లెలు. ఆమె శరీరంలో ప్రవహించే పాపపు రక్తమే నాలోనూ ప్రవహిస్తోంది.ఆ దైవం కాస్తలో కాస్త మేలు చేశాడు కాబట్టి నీ బుద్ధులు నాకు రాలేదు. నీలిమని మర్చిపోయినట్టే, లేక లేక వరప్రసా దంగా పుట్టానని మురిసిపోయిన నన్నూ మర్చి పొండి. మీలాంటి వాళ్ళకి ఆ మరుపు పెద్ద సమస్యేం కాదు!....గుడ్‌బై!" అంటూ ఆటోకేసి నడిచాడు ప్రయాగ.

అంతవరకూ చోద్యం చూస్తున్న వారిలో కొంద రికి మానవత్వం గుర్తొచ్చి అతన్ననుసరించారు.

ఆటో హాస్పిటల్‌కేసి దూసుకెళ్తుంటే శిలలా నిల్చుండిపోయాడు ఆనాటి కీచకుడు రాయుడు, ఈనాటి బడానాయకుడు నిరంజన్ రాయుడు.